# అన్నీ ఫేక్ హామీలే..

- బీజేపీ, కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే
- వాళ్లు ఒక్కటీ చేయరు.. నమ్మితే మోసపోతరు
- నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి
- కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



కోరుట్లలో దూదేకుల సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, చిత్రంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

కోరుట్ల/ మారుతీనగర్, నవంబర్ 9: 'కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగేదేం లేదు. ఆ పార్టీ నాయకులకు ఏది చేతకాదు. అది చేస్తాం.. ఇది చేస్తామని నానా హంగామా చేయడం తప్ప ఆచరణ సాధ్యంకాదు. వాళ్లు ఇచ్చేవన్నీ ఫేక్ హామీలే. వారు ఏండ్లకొద్ది పాలిస్తున్న రాష్ర్టాల్లో పనులు చేయనోళ్లు.. పథకాలు అమలు చేయనోళ్లు.. మన దగ్గర ఎట్ల చేస్తరు.. నేనొక్కటే చెబుతున్నా.. వాళ్ల మాటలు నమ్మితే మోసపోతరు.. జాగ్రత్త' అంటూ కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలను అప్రమత్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి కోరుట్ల పట్టణంలోని పూసల, దూదేకుల సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మెట్‌పల్లి పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ గార్డెన్‌లో తెలంగాణ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తనను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో సంజయ్ మాట్లాడారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అన్ని కులసంఘాలకు భవన నిర్మాణాల కోసం నిధులు ఇచ్చారని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని చెప్పారు. కోరుట్లలో వంద పడకల దవాఖాన, మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్, సెంట్రల్ లైటింగ్, బీటీ రోడ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. తాను ఇక్కడే పుట్టిన పుట్టి పెరిగానని, ప్రజల కష్టాలు, కన్నీళ్లు తెలుసునని, ఆశీర్వదించి గెలిపించాలని సూచించారు. కాగా, ఐదేళ్లకోసారి వచ్చి ప్రజలకు కనిపించే టూరిస్టు నేతలకు తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. విద్యావంతుడు అందరికీ అందుబాటులో ఉండే స్థానికుడు తన కుమారుడు బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మెట్‌పల్లిలో డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభ్యర్థి సంజయ్‌ను శాలువాలతో సత్కరించారు. పలువురు డ్రైవర్ అసోసియేషన్ నాయకులు ఆయనతో సెల్ఫీ తీసుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, సజ్జు, బీఆర్‌ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీం, నాయకులు పుప్పాల ప్రభాకర్, అన్వర్, మోసిన్, అమేర్, ఆయా కుల సంఘాల సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నవయువ తెలంగాణ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివలాల్, సంపత్‌గౌడ్, గణేశ్, యూనియన్ సభ్యులు రాజ్‌కుమార్, ముజీబ్, బిగ్ బాస్, సాయిలు, రవీందర్, రామకృష్ణ, దివాకర్, శ్యాం, మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పూదరి సుధాకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

# జగిత్యాల ప్రజల రుణం తీర్చుకోలేనిది

- 30 ఏండ్లలో జరుగని అభివృద్ధిని మూడేండ్లలో చేసిన
- మరోసారి అవకాశం ఇవ్వండి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్
- అట్టహాసంగా నామినేషన్ దాఖలు



జగిత్యాల : ర్యాలీలో గొంగడి ధరించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్ చిత్రంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 9: 'జగిత్యాల నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది. తొలిసారి ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ నియోజకవర్గాన్ని అన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించండి. జగిత్యాల పట్టణాన్ని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతా' అని జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం భారీ ర్యాలీతో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి సాదాసీదాగా మోతెరోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి రిటర్నింగ్ ఆఫీస్ అయిన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. నామినేషన్ పత్రాలను దాఖలు చేసి తిరిగి పార్టీ ఆఫీస్‌కు వచ్చారు. అనంతరం తీసిన ర్యాలీలో సంజయ్‌కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ప్రోద్బలంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నేత్ర వైద్యుడిగా ప్రజలకు చేసిన సేవను గుర్తించి 2014లో కేసీఆర్ జగిత్యాల టికెట్ ఇచ్చారని, తొలిసారి ఓటమిచెందినప్పటికీ నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో ఉన్నానని చెప్పారు. అది గుర్తించే ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని 2018లో భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తొలి రెండేండ్లలో కరోనా మహమ్మారి వల్ల ఆశించినంతగా పనులు సాగలేదని, గడిచిన మూడేండ్లలో 30ఏండ్లలో కాని అభివృద్ధిని జగిత్యాల నియోజకవర్గంలో చేసి చూపించానని వివరించారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో దీక్షకు దిగి కేసీఆర్ తెలంగాణ సాధించారని గుర్తు చేశారు. సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ముందుకుసాగారని చెప్పారు. ఎన్నో సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల్లో భరోసా నింపారన్నారు. ఆడబిడ్డల పెండ్లిల్లకు లక్ష రూపాయలు అందించి పేదలకు ఎంతో భరోసానిచ్చారన్నారు. కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు వివరించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే 100 పడకల మాతాశిశు దవాఖానను, మెడికల్ కళాశాలను, 650 పడకల మల్టీ స్పెషాలిటీగల మెడికల్ కళాశాల అనుబంధ దవాఖానను తీసుకువచ్చినట్లు చెప్పారు. జగిత్యాల పట్టణంలో 20వేల మంది జనాభాకు గూడు కల్పించానని, దీంతో తన జన్మ ధన్యమైందన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశంలోని 751 జిల్లాల్లో జగిత్యాల రెండో స్థానంలో నిలిచిందని, కేంద్ర ప్రభుత్వమే అవార్డు ఇచ్చిందన్నారు. ఇలా మనం చేసిన అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో అవార్డులు ఇస్తూనే గల్లీలో లొల్లి చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ నానాటికి దిగజారిపోతున్నారన్నారు. నాటి బీజేపీ ఎంతో విలువలతో, సంస్కారం, సంస్కృతి, సంప్రదాయాలు కలిగి ఉండేదని, నేడు ఉన్న బీజేపీకి అవేమీ లేవని నిప్పులు చెరిగారు. తరచూ ప్రశ్నించేందుకే ఉన్నానని మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి 2018లో ఓడిపోయారని, తర్వాత ఎమ్మెల్సీ అయ్యారని, ప్రశ్నించేందుకు ఇంకా రెండేండ్ల సమయముందని, ఇప్పుడు పోటీ ఎందుకో అన ఎద్దేవా చేశారు. 'నేనొక్కటే చెబుతున్నా.. నియోజకవర్గ ప్రజలే నా కుటుంబ సభ్యులు. చివరి వరకు అభ్యున్నతికే పాటుపడుతా. ఒకసారి గెలిచినందుకే ఇంత అభివృద్ధి చేశా. మరో సారి అవకాశమిస్తే జగిత్యాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా. మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని' సంజయ్ కోరారు.

### జగిత్యాల గులాబీవనం..

జగిత్యాల జనసంద్రమైంది. జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థిగా, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ గురువారం నామినేషన్ వేయగా, నియోజకవర్గ నలుమూలల నుంచీ అభిమానలోకం తరలివచ్చింది. ఈ సందర్భంగా మోతెరోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ, బైపాస్ రోడ్డులోని దేవీశ్రీ గార్డెన్ మీదుగా మార్కండేయ ఆలయం వద్ద యావర్ రోడ్డుకు, అక్కడి నుంచి కొత్త బస్టాండ్ చౌరస్తా, తహసీల్ చౌరస్తా మీదుగా తిరిగి పార్టీ కార్యాలయానికి చేరింది.

# కాంగ్రెస్‌తో ప్రమాదం

- రాష్ట్రం అంధకారమైతది.. అన్నీ బంద్ అయితయి
- నమ్మి ఓటేస్తే ఆగమైపోతరు.. జాగ్రత్త
- మరొకసారి గెలిపించండి.. మీ వెంటే ఉంటా
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్



ధర్మపురి : ర్యాలీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేష్‌నేత

ధర్మపురి, నవంబర్ 9: ''స్వరాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో సంతోషంగా సాగిపోతున్న మన జీవితాలను ఆగం చేసేందుకు దుష్టశక్తులన్నీ ఒక్కటైనయి. కాంగ్రెస్‌తో కలిసి మళ్లీ రాష్ర్టాన్ని నాశనం చేసేందుకు వస్తున్నయి. నేనొక్కటే చెబుతున్నా. కాంగ్రెస్ పార్టీతో తెలంగాణకు చాలా ప్రమాదం. రాష్ట్రం అంధకారమైతది. మన పథకాలన్నీ ఆగమైతయి. అలాంటి వాళ్లు మనకు అవసరమా..? మీరే ఆలోచించండి' అంటూ ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ధర్మపురి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ధర్మపురి ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మాట్లాడారు. అధికారంలో ఉన్నన్నినాళ్లు రైతులకు సరిపడా కరెంటు ఇవ్వకుండా, అన్నం పెట్టే రైతన్న ఆత్మహత్యలకు కారణమైన కాంగ్రెస్, ఇప్పుడు రైతు సంతోషంగా ఉంటే చూడలేకపోతున్నదని మండిపడ్డారు. సాగుకు 24గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని, 3 గంటలే చాలని రేవంత్‌రెడ్డి సిగ్గులేని వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. అంటే ఈ లెక్కన కాంగ్రెస్ వస్తే 24గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయబోతున్నట్లు ముందుగానే ప్రకటించినట్లుగా అనిపిస్తున్నదన్నారు. రైతన్న మేలు కోరి ఇచ్చే రైతుబంధును కాంగ్రెస్ మాజీ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి దండుగ అని అంటున్నారని, రైతుబంధును నిలిపివేయాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసిన దుర్మార్గుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఒక్కటే కాదు పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసేందుకు కుట్ర పన్నుతోందని, అలాంటి పార్టీని బొందపెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక్కడ అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెబుతున్నదని, కానీ ఏ ఒక్కటీ చేయరని, కర్ణాటకలోనూ ఇలాగే రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు, కులం ముఖ్యం కాదని వ్యవస్థ ముఖ్యమని, ఇది చరిత్ర చెబుతున్న సత్యమన్నారు. వ్యవస్థ కోసం పనిచేసే నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. అన్ని వర్గాలను సమానంగా చూసే కేసీఆర్ ప్రభుత్వమే కొనసాగాలంటే అందరం ఐక్యంగా ఉండాలన్నారు. పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లుగా రాష్ట్రంలో ఇస్తున్నట్లుగానే 24గంటల కరెంటు ఇస్తామని కర్ణాటకలో ఎన్నికల సమయంలో చెప్పి అధికారంలోకి వచ్చారనీ, ఐదు నెలలు గడుస్తున్నా..? అక్కడ ఎందుకు సాధ్యం కావడంలేదో ఆ పార్టీ నాయకులే చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్ పులిలాంటివారని, అధికారం కోసం అబద్దపు మాటలు చెబుతున్న కాంగ్రెస్ జిత్తుల మారి నక్క అని ఎద్దేవా చేశారు. 'పులి పులే.. నక్క నక్కే.. బీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్సే.. కాంగ్రెస్ కాంగ్రెస్సే.. అంటూ వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్‌ను ఢీకొట్టే నాయకుడు దేశంలోనే లేరని గర్వంగా చెప్పుకోవచ్చని, అంతటి మహనీయుని బాటలో సమాజ శ్రేయస్సు కోసం మనందరం నడవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. 'ఈ ఎన్నికల్లో ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్తలో కేసీఆర్ నాయకత్వం కనబడాలి. కార్యకర్తలందరూ కొప్పుల ఈశ్వర్‌లై పనిచేయాలి' అని మంత్రి ఈశ్వర్ శ్రేణులకు సూచించారు.

### ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేను..

'నేను ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగే ఉన్న. నేనెప్పుడైనా.. మంత్రి లెక్క, ఎమ్మెల్యే లెక్క ఫీల్ కాలె. మీలో ఒకడిగానే ఉన్న. కింద కూసుంట.. చాపల కూసుంట.. గాలిమోటర్ల పోత.. కార్ల పోత.. ఆటోల పోత.. అవసరం ఐతే నడిసిపోత.. ప్రజలు ఎక్కడ చేయి అడ్డం పెట్టి ఆపితే అక్కడ ఆగుత.. 'అన్నా.. ఇయ్యాల ఇక్కడనే ఉండాల్నె' అని ప్రజలు కోరితే ఆన్నే ఉంటా.. సమస్యలు ఏందో తెలుసుకుంట.. పరిష్కారం అయ్యేదాక నిద్రపోను. గిసోంటి నన్ను దూరం చేసుకుంటరా?. ఎంతోమందికి జీవితాన్ని ఇచ్చిన. ఎంతో మంది ప్రాణాలు కాపాడిన. దవాఖాన్ల పడితే ఆదుకున్న. ప్రతి ఇంట్లో ఒక్కడినై ఉన్న. 14 ఏండ్లుగా ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు మరువలేనవి. ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేనిది. మీకు నాయకుడిగా కాదు. మీ సేవకుడిగా ఉంటా. మరొకసారి మీకు సేవ చేసే భాగ్యం కల్పించండి' అంటూ మంత్రి ఈశ్వర్ మాట్లాడిన మాటలకు ప్రజలు ఫిదా అయిపోయారు. కేరింతలు కొడుతూ..ఈలలు వేశారు.

### ధర్మపురి అనే పొలంలో ఒక్కమడి కూడా ఎండనియ్య..

'నాకు ధర్మపురి నియోజకవర్గం అనే పొలం ఉంది. అందులో 146 మడుల్లాంటి గ్రామాలున్నయి. ఒక రైతు రాత్రి, పగలు కష్టపడి తన పొలంలో ఏ ఒక్క మడినైతే ఎండనివ్వడో.. అదే మాదిరిగా ప్రతి గ్రామాభివృద్ధికి పాటుపడుతా. ఇప్పటికే ప్రతి గ్రామంపై దృష్టి సారించి అభివృద్ధి చేసిన. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా. నవంబర్ 30న కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని' మంత్రి ఈశ్వర్ కోరారు.

### గులాబీమయమైన ధర్మపురి..

ధర్మపురి గులాబీమయమైంది. కొప్పుల ఈశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచీ పార్టీ శ్రేణులు సహా ప్రజానీకం భారీగా తరలివచ్చింది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. లక్ష్మీనరసింహ గార్డెన్స్ నుంచి దుర్గాకాలనీ, అంబేద్కర్ చౌక్, తెలంగాణ తల్లి విగ్రహం నుంచి గాంధీ, పటేల్, వివేకానంద కూడలి దాకా డీజే మోతలు, కార్యకర్తల నృత్యాలు, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలతో ర్యాలీ జరుగగా, ఉదయం 9 గంటలకే ధర్మపురి జనసంద్రమైంది. 11గంటలకు మంత్రి ఈశ్వర్ నామినేషన్ వేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీలు చిట్టిబాబు, కరుణశ్రీ, లక్ష్మి, బలరాంరెడ్డి, జడ్పీటీసీలు బాధినేని రాజేందర్, బత్తిని అరుణ, రాజేందర్‌రావ్, పద్మజ, సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్లు అయ్యో రి రాజేశ్‌కుమార్, వెంకటేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు అయ్యోరి వేణు, అశోక్, యునుస్, అనంతుల విజయలక్ష్మి-లక్ష్మణ్, వొడ్నాల ఉమాలక్ష్మి-మల్లేశం, పురాణపు కిరణ్మయి-సాంభమూర్తి, కార్తీక్, నాయకులు వెంకటేశ్వరావ్, మురికి శ్రీనివాస్, భారతపు గుండయ్య, చిలివేరి శ్యాంసుందర్, సంగి శేఖర్, అక్కపల్లి సురేందర్, గునిశెట్టి రవీందర్, వేముల నరేశ్, స్తంబంకాడి మహేశ్ ఉన్నారు.